# మల్లి నవ్వింది

ఆ కాలేజీ విద్యార్థినీ విద్యార్థుల విహారయాత్ర చివరి రోజుకు వచ్చేసింది. రెండు వారాలు లెక్చరర్స్, స్టూడెంట్స్ ఎంతో ఆనందోత్సాహాలతో గడిపారు. హిస్టరీ స్టూడెంట్స్ చరిత్రకు సంబంధించిన విషయాలలో ఎక్కువ శ్రద్ధ చూపితే, సాహిత్యాభిలాషవున్న మరికొందరు కవిత్వాలు చెప్పారు. కళాతృష్ణ వున్న ఆ యువతీ యువకులంతా ఆలయ నిర్మాణాన్నీ, శిల్పసౌందర్యాన్ని చూసి అబ్బురపడుతున్నారు. వారిమధ్య తీవ్రమైన చర్చలు, వాదోపవాదాలు, ఆటలు, పాటలు, అల్లర్లు అనేకం చోటు చేసుకున్నాయి.

ఎవరితోనూ కలవని, దేన్లోనూ పాలుపంచుకోని వింత మనస్తత్వంగల మాధవ్ మాత్రం అందరికీ అంతుచిక్కని ప్రశ్నే అయ్యాడు. 'ఏమిటి ఇతని వాలకం? కొంపదీసి ఇరవైలో అరవైనా? ఈ ప్రబుద్ధునికి కుర్రతనపు చేష్టలు మచ్చుకైనా కనిపించవు. కాలేజీ లైఫ్ ఎంత హుషారుగా ఎంజాయ్ చేయాలి? ' అనుకుని మాధవ్‌ని తమ దారికి తెచ్చుకోవడానికి ఈ మూడేళ్లూ ఎన్నో రకాలుగా ప్రయత్నించారు. ఈ ఎక్స్ కర్షన్‌లో మాధవ్‌ని మార్చి తీరతామని ఒకళ్లతో ఒకళ్లు పందాలు కూడా వేసుకున్నారు.

చివరిరోజు రానేవచ్చింది. ఏ ఒక్కరూ గెలవలేకపోయారు. ఆడపిల్లలకి కూడా ఇందులో కీలకమైన పాత్రవుంది కావాలని వాళ్లు చేసిన చిలిపి చేష్టలు అతనిముందు కొరగాకుండాపోయాయి. అందరి మనసుల్లోనూ అదో రకమైన ఆందోళన. ఏదో ఎదురు దెబ్బ తగలిందన్న భావన. ఆలోచనల్లో పడిపోయారంతా.

"ఈ మట్టిసుద్ద మహానుభావుణ్ణి కవ్వించడం ఎలా" "వీడు ఎలా అయినా మనతో చేయి కలిపి తీరాలీవేళ"

ఇలా ఒక్కొక్కరూ ఒక్కోమాట అంటున్నారు.

"ఏయ్ విజ్జూ! నువ్వు మన కాలేజీ మొత్తానికి మెరుపుతీగవి. మరి నువ్వే ఈ మహానుభావుడిలో చలనం కలిగించాలి" అంటూ ఆడపిల్లలంతా ఆ బరువును విద్యుల్లత మీద పడేశారు. విద్యుల్లత మెదడులో మెరుపులాంటి ఆలోచన మెదిలింది. మరుక్షణం తలదించుకొని స్తబ్దుగా కూర్చున్న మాధవ్‌ని చుట్టుముట్టిందా బృందం.

"సరదాగా ఇవాళ నువ్ మాతో ఆడిపాడకపోతే వూరుకోం" అంటూ ఈలలు వేస్తున్నారు. గోలగోలగా అరుస్తున్నారు. అతని గడ్డం, జుట్టూ, షర్టు పట్టి ఊపేస్తున్నారు.

మాధవ్ చెవులు గింగురుమంటున్నాయి. వళ్లు గగుర్పొడుస్తోంది.

"అరే! మాధవ్, ఈ మూడేళ్లు కాలేజీ జీవితం కలిసి గడిపాం అన్నమాటేగాని నన్ను ముట్టుకోకు నామాల కాకి అన్నట్టు తప్పించుకు తిరిగావు కదరా! చదువంటే వంట పట్టించుకున్నావు. ఇక డిగ్రీ పూర్తి చేసుకొని మనమంతా ఎవరికి వారైపోతున్నాం. మమ్మల్ని స్నేహితులుగా గుర్తుంచుకోవాలని లేదా!" అని సూటిగా అడిగారు.

మాధవ్ ఉలిక్కిపడ్డాడు. నిజమే! తనంటే ఇలా వున్నాడు కానీ! ఈ వయసులో ఈ ఉత్తేజం. ఈ ఉత్సాహం అన్నీ సహజమే. బలవంతాన పెదవులపైకి చిరునవ్వు తెచ్చుకున్నాడు. "ఓకే డియర్ ఫ్రెండ్స్. ఇంతకీ మీరేమంటారు?" అందర్నీ కలయజూస్తూ అన్నాడు.

వెంటనే చీట్లాట మొదలైంది. రాసివున్న చీట్లన్నీ ఖాళీ టిఫిన్ డబ్బాలో వేసి, మొదట మాధవ్‌నే తియ్యమన్నారు.

"నోనో మన సారథి తీస్తాడు. అన్నింటిలోనూ అందెవేసిన చేయికదా ! ఏ చీటిలో ఏమి రాసున్నా చిటికెలో చేసేస్తాడు " అన్న మాధవ్ మాట పూర్తి కానేలేదు.

"నువ్వు హుషారుగా ఉండాలనేకదరా ! ఈ ఆటపాటలు, సతాయించక ముందు నువ్వే తియ్యి" అంటూ చీట్లున్న డబ్బాలోకి మాధవ్ చేతిని నెట్టేశాడు సారథి.

మాధవ్ వేళ్లమధ్య ఇరుక్కొన్న చీటిని లాక్కుని చదివాడు సారథి.

"విద్యుల్లతని గాఢంగా ముద్దు పెట్టుకోవాలి ".

అంతే అందరూ కేరింతలతో క్లాప్స్ కొడుతూ " విద్యుల్లతని ముద్దపెట్టుకోవాలి... ముద్దుపెట్టుకోవాలి" అన్నారు. విద్యుల్లత శరీరంలో విద్యుత్ ప్రవహించినట్టయింది. మరుక్షణం స్తంభం చాటుకు వెళ్లి నిల్చుంది.

'ఈ విషమ పరిస్థితిని ఎదుర్కోవడం ఎలా!' అనుకుంటూ పరిసరాలన్నీ పరికించాడు మాధవ్.

ఆ ప్రదేశంలో ఎటుచూసినా నల్లని కొండ గుహల్లో మలచిన సభామంటపాలు, ప్రతి స్తంభం చుట్టూ రాతినే చెక్కిన లతలు దర్శనమిస్తాయి. గోడలకు వివిధ భంగిమల్లో

మలచబడివున్న సౌందర్యం ఉట్టిపడే స్త్రీమూర్తుల శిల్పాలను తీర్చిదిద్దడంలో భారతీయ సంస్కృతి కలకాలం నిలిచిపోయేట్టు తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు శిల్పకారులు. ప్రతీ శిల్పం లోనూ జీవకళ ఉట్టిపడుతోంది. ఒక్కో శిల్పానికి ఒక్కోపేరు పెట్టారానాటివారు. లతల్లో ఒదిగిపోయి లతలాగే ఒంపుసొంపులు ప్రదర్శించిన శిల్పానికి లతాంగి అని, విరిసేపూల మధ్య వీచే గాలిలో ఏదో లోకంలో తేలిపోతున్నట్టున్న శిల్పానికి ఆమని అని, కారు మేఘాల్ని చీల్చుకుంటూ తళుక్కున మెరిసే మెరుపుతీగలా వున్న శిల్పానికి విద్యుల్లత అని.

పేరులో ఏముంది పెన్నిది? అని ఓ మహాకవి అంటే అన్నాడు కానీ మాధవ్‌కి నిజంగా పెన్నిధి పేరులోనే దొరికింది. అప్పటికే తోటి స్నేహితులు అల్లరి చేస్తూనే ఉన్నారు. " ముద్దు పెట్టాలి... ముద్దు పెట్టాలి" అని.

మాధవ్ వెంటనే ముందుకు కదిలాడు. ఒక్క క్షణం అందరూ నిశ్శబ్దంగా కన్నార్పకుండా చూస్తున్నారు. విద్యుల్లత తలవంచుకొని అర్థనిమీలిత నేత్రాలతో మాధవ్‌ని చూసింది. ఆమె బుగ్గలు సిగ్గుతో కెంపులయ్యాయి. అందరి ఆలోచనలనూ తలకిందులు చేస్తూ మాధవ్ విద్యుల్లత తలకిందులు చేస్తూ మాధవ్ విద్యుల్లత అని రాసి వున్న శిల్పసుందరిని ముద్దుపెట్టుకున్నాడు. ఒక్క క్షణం ఏం జరిగిందో అర్థం కాలేదు అందరికీ వెంటనే తేరుకొని.

"నోనో మేం ఒప్పుకోం. రాళ్లకి, రప్పలకి ముద్దులు పెడితే కుదరదు. విద్యుల్లతకి ముద్దివ్వాలి" అన్నారంతా.

"మన ఒప్పందం ప్రకారం చీటిలో రాసినదేమిటి? విద్యుల్లతని ముద్దు పెట్టుకోవాలన్నారు అంతేగాని మనిషినా? శిల్పాన్నా ? అని రాయలేదుగా ! అందుకే నేను చేసింది కరక్టే" అని సమర్థించుకున్నాడు మాధవ్.

అందరూ అతని సమయస్ఫూర్తికి అవాక్కయితే, విద్యుల్లత నిరాశపడింది. ఆమె ఊహించుకున్నదంతా తారుమారైపోయింది. ఈ రకంగా అప్సరసలాంటి తనని అవమానించాడన్న బాధతో విద్యుల్లత కళ్లల్లో నీళ్లు తిరిగాయ్.

"నువ్వేం పట్టించుకోకే! మొండివాడు రాజు కంటే బలవంతుడట. మనమేం చేస్తాం అందివచ్చిన అదృష్టాన్ని అతనే కాలదన్నుకున్నాడు" స్నేహితులందరూ విద్యుల్లతనూ ఓదార్చారు.

అనూహ్యమైన ఈ సంఘటనకి మాధవ్ చలించిపోయాడు. ఒకప్పుడు ఈ బలీయమైన కోరికే తనలో పశుత్వాన్ని రేపింది. తెలిసీతెలియని వయసులో హృదయాన్ని ఊపేసే ఉద్రేకంలో, అందమైన అమ్మాయిని ముద్దుపెట్టుకోవాలనే వాంఛ మొలకెత్తబట్టే కదా! తనంత పని చేశాడు. మల్లి రూపం అతని కళ్లల్లో కదలాడింది.

బుట్ట బొమ్మలా పరికిణీ కుచ్చిళ్లు రెపరెపలాడుతుంటే చలాకీగా తిరుగుతూ చకచకా పని చేస్తూ కళ్ళల్లో అమాయకత్వంతో, మాటల్లో చిలిపితనంతో తనని ఇట్టే ఆకర్షించేది. చూసినకొద్దీ

చూడాలనీ, తనతో ఎంతసేపైనా మాట్లాడాలనీ తెగ ఇదైపోయేవాడు. అంతటితో ఆగివుంటే మల్లికి తనవల్ల అన్యాయం జరిగేదా ! ఏళ్లు గడిచిపోయినా ఆనాటి సంఘటనలన్నీ ఈ రోజే జరుగుతున్నట్లు అనిపిస్తోంది.

తను ఇంటర్ తప్పి సప్లిమెంటరీ పరీక్ష రాస్తున్నాడు. ఇంట్లో అంతా మామయ్య కూతురు పెళ్లికి బయలుదేరుతున్నారు అమ్మ తనని దగ్గరకు పిలిచి "ఒరేయ్ మొద్దూ! ఒక్కడివే ఇంట్లో వున్నావని ఏ సినిమాలకీ చెక్కెయ్యకు. గంటల తరబడి ఆ దిక్కుమాలిన టివి ముందు అఘోరించటం కాదు. బాగా చదివి ఈసారైనా పాస్ కావాలి" అని గట్టిగానే మందలించింది.

"తప్పకుండా చదువుతానమ్మా" సంబరంగా అన్నాడు.

ఆ సంబరానికి కారణం వేరే వుంది. తనొక్క క్షణం మల్లితో మాట్లాడబోయినా, తను వేసే జోకులకి మల్లి కాస్త నవ్వినా అమ్మ ఇద్దరినీ తిడుతుంది. ఇక ఈ రెండు రోజులూ తన ఇష్టం. అమ్మతో గొడవుండదు.

"టీ ఫ్లాస్కులో పోసి వెళ్లనా! చిన బాబూ ?" అడిగింది మల్లి.

పుస్తకంలో తలదూర్చి చదువుతున్నట్టు నటిస్తున్న మాధవ్ చివాలున తలెత్తాడు.

"అదేంటి వెళ్ళిపోతావా?"

"ఇంకేం చేయను చినబాబూ"

"ఏదో ఒకటిలే. నువ్వుండాలి"?

"ఎందుకు?" అమాయకంగా అడిగింది.

"నేను బోల్డు జోక్స్ చెప్తా. అవి విని నువ్వు నవ్వుతూ వుంటే అలా చూస్తూండిపోవాలనిపిస్తుంది" అన్నాడు.

మల్లి పెదవులపై చిరునవ్వు. మల్లి నవ్వింది. తన వళ్లు ఝల్లుమంది. కబుర్లు, జోక్స్‌తో గంటలు గడిచిపోయాయి. హఠాత్తుగా అంది మల్లి.

"అమ్మో ! ఎంత చీకటిపడిపోయిందో ! అమ్మానాన్న, తాతయ్య అందరూ కోప్పడతారు. తమ్ముళ్లు, చెల్లి నేనెల్లేదాకా అన్నమే తినరు. ఇంక నేవెళతా చినబాబూ? రోడ్డు దాకా సాయంరా? చాలు" అంది.

దాని మాట విన్నట్టే ఇంటికి తాళం వేసి బయలుదేరాడు. పైన పున్నమి చంద్రుడు ఆ ఇద్దరికీ వెన్నెల స్నానం చేయిస్తున్నాడు. చల్లని గాలి గిలిగింతలు పెడుతోంది. ఓ ఆటో పిలిచి తను కూర్చుంటూ మల్లినీ కూర్చోమన్నాడు.

"ఆటో ఎందుకు చినబాబు? ఈ రోడ్డు దాటితే కుడివైపు రెండో సందులోనే మా ఇల్లు. టీ దుకాణం. కిళ్లీకొట్టు తెరిచే వుంటాయ్‌కదా! నేనడిచే వెళ్లిపోగలను" అంది.

"నువ్ తొందరగా ఆటో ఎక్కు మనం ఏదో పోట్లాడుకుంటున్నాం అనుకొని అందరూ మనల్నే ఎలా చూస్తున్నారో చూడు" అన్నాడు.

దాంతో మల్లి ఆటోలో కూలబడింది. ఆపై చినబాబు ఎలా చెప్తే అలా నడుచుకుంది. ఒక ఆటబొమ్మలా వుండిపోయింది. మాధవ్ రొట్టె విరిగి నేతిలో పడ్డట్టయింది. మల్లి ఇలా దారికి వచ్చేస్తుందని, తన మాటలకు, చేతలకు తలవంచేస్తుందని తనకు తెలియదా! తనంటే ఎంత గౌరవం! మరెంత ఆరాధన. మల్లికి చదువుకోవాలని తీరని తపన ఉన్నప్పుడు అమ్మతో పోట్లాడి. మల్లి ఇంట్లో వారినందర్నీ ఒప్పించి స్కూల్లో జాయిన్ చేసింది తనే మల్లి పట్టుదలతో చదివి ఒక్కో క్లాసు పైకెక్కుతూ...

"ఇదంతా మీ చలవే చినబాబూ ! పని పాటలు తప్ప మనకి చదువెందుకు? ' అని తిట్టి పోసే మా ఇంట్లోవాళ్లకి ' ఇది కూడా బడికి పరుగులు పెడితే ఇంటెడు చాకిరీ ఎవరు చేస్తారు? చదువూలేదు చట్టుబండలూలేదు. దానితో సమానంగా నువ్వూ వంత పాడతావేంటిరా? అనే మీ అమ్మ గారిని ఏం మంత్రం వేసి లొంగదీశారు చినబాబూ? నేనిలా చదువుకోగలుగుతున్నానంటే మీ గొప్ప మనసుగాక మరేంటి? " అంటూ తన పాదాలకు నమస్కరించింది.

అందుకే తన ఆకాంక్ష అతి సులువుగా నెరవేరబోతోంది. సినిమా చూస్తున్నంత సేపూ తన మనసుతీరా ఆమెపై చేతులు వేస్తూనే ఉన్నాడు. సినిమా పూర్తయి లైటు వెలగగానే మల్లి కళ్లలో బిడయంతోపాటు ఉక్రోషం, కోపం కూడా నిండివున్నాయ్. ఒక్కక్షణం తత్తరపడ్డాడు.

మౌనంగా ఇంటి తాళాలు తీసి మల్లి చేయి పుచ్చుకొని లోపలకు వచ్చాడు. మల్లి చూపులు అతనికి కాస్త భయన్నే కల్గిస్తున్నాయ్. అయినా లెఖ్ఖ చేయలేదు. అమాంతం కౌగిలించుకొని ఓ ముద్దు పెట్టేసుకున్నాడు. అంతే మాధవ్ చెంప ఛెల్లుమంది.

"మీరేం చేస్తున్నారు చినబాబు. ఎంతో మంచివారని నేననుకుంటూ వుంటే ఏమిటి దంతా?

"ఏముంది ఉత్తసరదా అంతే"

"సరదాలంటే ఇలాంటివా! నేను చచ్చినా ఒప్పుకోను. ఎంత చీకట్లో అయినా మా ఇంటికి వెళ్లిపోగలను" రెండు అంగల్లో వీధి తలుపు తెరవబోయింది.

"ఎక్కడకెళతావ్? నువ్వు నా మల్లివి. నేను నిన్ను వదల్లేవదలను" ఆపై అతని పట్టుదలే నెగ్గింది.

"కాదు, కూడదు, ఒద్దు. తప్పు" అని మల్లి ఎంత పెనుగులాడినా ప్రయోజనం లేకపోయింది.

* * *

తెల్లారిందోలేదో మల్లి. తాత సుబ్బన్న. తండ్రి సూరన్న మాధవ్ ఇంటికి పరుగు పరుగున వచ్చారు మాధవ్ గాఢనిద్రలో వున్నాడు. తలుపు తీసిన మల్లిని చూసి నిర్ఘాంతపోయారిద్దరూ. చెదిరిన జుట్టూ, పీక్కుపోయిన ముఖం, నిద్ర లేమితో ఎర్రబడ్డ కళ్లు, బుగ్గలపై కన్నీటి చారలు. ఆ చిన్నారిని చూస్తుంటే వాళ్ల కాళ్ల కింద భూమి పగులుతున్నట్టయింది. తమ గారాల మల్లితో సహా ఏదో అగాథంలోకి కూరుకుపోతున్నట్టనిపించింది.

"అయ్యయ్యో నా తల్లి ఏందమ్మా ఇట్టావున్నావు ? నిన్నేం చేశాడమ్మా" మనవరాల్ని అమాంతం ఎత్తేసుకొని వీపు నిమురుతూ అడిగాడు తాత సుబ్బన్న.

మల్లి తండ్రి సూరన్న రక్తం ఉడికిపోతోంది.

"నా బిడ్డ ఇంటికి రానప్పుడే ఈ మాధవ్ గాడు ఇట్టాటి పాపిట్టి పనేదో సేసే వుంటాడని కనిపెట్టాను. నేను సుక్కమ్మ ఎర్రిమా లోకం అయిపోయి ' ఊరుకో మావ, మనమ్మ గారింటి కాడే గందవుంది. నీది మరీ చాదస్తం. చినబాబు సదూకుంటే సాయం వుంటాది' అనేసి నా కోపాన్ని జోకొట్టేసినాది. ఈడి పని సెప్తానుండు" ఊగిపోతూ అంటున్నాడు సూరన్న.

మాధవ్ అదిరిపడి లేచాడు. తనని మింగడానికి నోరు తెరిచిన పెద్దపులిలా ఎదురుగా సూరన్న.

"ఓమైగాడ్, మల్లి అంతా చెప్పేసిందా! వీళ్ళతో" మాధవ్ గుండెలు వేగంగా కొట్టుకున్నాయ్.

"మీరు మనుష్యులని నమ్మితే, పశువులైపొనారాబాబూ! నానేం తక్కువగాదు. నువ్వు పశువయ్యితే నాను పామునౌతా. పగబట్టి నీ బతుకునే కాటేత్తా చూస్కో! సెప్పరా! నా చిట్టీతల్లిని ఏంచేశావ్?" మాధవ్ జుట్టు పట్టుకొని ఈడ్చి ఎడాపెడా వాయించేశాడు సూరన్న.

"నీకు దణ్ణం పెడతా నాన్నా! వదిలేయ్ నాన్నా! చినబాబునేం చేయకు"?

"వదలటం ఏటే పిచ్చితల్లి. సంపిపాతేత్తా. పాపిట్టోడు పసిదానివని సూడకుండా నీ బతుకుతో సెలగాటమాడేడు గదే"

"లేదు ... చినబాబు నన్నేమీ చేయలేదు. నేచెప్తున్నాగా" సత్తువంతా కూడ దీసుకుని దృఢంగా అంది మల్లి.

మల్లిమాటలు మాధవ్ పై పన్నీటిజల్లు కురిపించాయి. స్వచ్ఛమైన మల్లిప్రేమ అతన్ని ఉక్కిరిబిక్కిరి చేసింది. అంతమాట ఎలా అనగలిగింది మల్లి. మల్లిని తనేం చేయలేదా! నిజానికి ఎంత మూర్ఖంగా ప్రవర్తించాడు. అది ఎంత బతిమాలినా ఏడ్చినా చెవిన పెట్టలేదు. తన ఇష్టం వచ్చినట్టు ప్రవర్తించి, చిన్నపిల్ల అనైనా చూడకుండా! ఇక ఆలోచించలేకపోయాడు. కన్నీళ్లు ఉబికి వచ్చేస్తున్నాయ్! సూరన్న చేతుల్లోనుండి విడిపించుకుంటూ,

"నేనొప్పుకుంటున్నాను సూరన్నా! మీరెవ్వరూ బాధపడకండి. నేను మీ మల్లిని పెళ్లి చేసుకుంటాను" అంటూ సుబ్బన్న పాదాల మీద పడిపోయాడు.

"సినబాబూ! తెలిసీతెలీని వయస్సులో చేసిన తప్పుకి ఇంత మాటిచ్చినావా బాబూ ! మీ ఇద్దరూ సుఖంగా ఉండాల" మాధవ్‌ని లేవదీసి మనమరాలి చేతిని అతని చేతుల్లో పెట్టి అన్నాడు సుబ్బన్న.

"పిచ్చినాన్నా. ఈల్నేటి నమ్ముతావ్ ! ఉల్లి మాటలు నీటి మూటలు" సూరన్న శాపనార్థాలు పెడుతూనే వున్నాడు.

* * *

తరువాత చాలా పెద్ద గొడవే జరిగింది. సూరన్న ఆవేశం పోలీస్ స్టేషన్‌కి, కోర్టుకి పరుగులు తీసింది. మాధవ్ తల్లిదండ్రుల అహంకారం తప్పుని మల్లి మీదకి నెట్టేసింది. చుక్కమ్మ కూతురికి జరిగిన అన్యాయాన్ని తట్టుకోలేకపోతోంది. కంటికి, మంటికి ఏకధారగా ఏడుస్తూనే వుంది. తన దుఃఖాన్ని తీర్చగలిగేది యజమానురాలే అందుకే

"ఎన్నేళ్ల కాన్నుంచో తమ ఇంట్లోనే పడివున్నం. కట్టం. సుఖం తమరే సూసుకున్నారు. మీ సేతుల్లోనే పెరిగిన నా బిడ్డని మీ కడుపులోనే పడేసుకోండి. ఆ రోజు నాకు జొరంగా వుంది. దాన్ని పన్లోకి పంపినా! ఇంత జరిగిపోనాది" మాధవ్ తల్లి అయిన ధనలక్ష్మిని ప్రాధేయపడింది చుక్కమ్మ.

"ఎంత ధైర్యంగా చెప్తున్నావే! నీ కూతురు నా కోడలా? ముద్దు చేసిన కుక్క మూతిక రవడం అంటే ఇదే. అసలు నీ కూతురికి సిగ్గుందే? ఇదేదో ఆటనుకుందా? మా వాణ్ణి కవ్వించి నాటకం ఆడుతుందా? " అందావిడ. వాళ్లిద్దరి మధ్య పెద్ద గందరగోళం చెలరేగేటట్టుంది పరిష్కారం ఏమిటి? ఆలోచించాడు ధర్మయ్య.

"చూడు చుక్కమ్మా! పిల్లలిద్దరికీ ' పెళ్లి వయస్సు రాలేదు. మళ్లీ నువ్వా మాటెత్తద్దు' అంటూ ఓ సలహా చెప్పాడు. చెల్లెలు ధన లక్ష్మిని ఒప్పించడమే ధర్మయ్యకి కాస్త కష్ట సాధ్యమైంది.

"ఏమిట్రా నువ్వనేది? నాన్నగారు నాకు పసుపు కుంకుమగా ఇచ్చిన రెండెకరాల కొబ్బరితోట వీళ్లకి ధారాదత్తం చేస్తావా !" అంటూ అన్నగారిమీద విరుచుకుపడింది.

"నీ ఆస్తిలో ఇదే మాత్రం? నేనలా అన్నాను కనకే ఆ ఇంటిల్లిపాదీ చప్పబడిపోయారు. వాళ్లు గుట్టురట్టు చేస్తే. వాళ్లకే కాదు మనకీ చచ్చేంత అవమానం. ఈ రోజుల్లో ఆడపిల్లలకే కాదు మగపిల్లలకీ మంచి సంబంధాలు దొరకడం తేలికేం కాదు. నువ్వు కిమ్మన కుండా వుండు. ఈ కొద్దిపాటి ఆస్తితో వాళ్ల ఇబ్బందులూ తీరతాయ్. మనవాడి మీదపడ్డ మచ్చా కడిగేసుకోవచ్చు" అంటూ చెల్లి నోరు నొక్కేశాడు ధర్మయ్య.

పుట్టెడు దుఃఖం పట్టెడు సిరులు తెచ్చి పెట్టిందన్నట్టు రెక్కాడితేగానీ డొక్కాడని స్థితిలో వున్న మల్లి కుటుంబం గ్రామానికి మకాం మార్చింది. ఫలసాయం అనుభవంలోకి వచ్చి కాస్త శ్రమిస్తేనే ముప్పొద్దులా తినగలుగుతున్నారు. కానీ మల్లికి జరిగిన అన్యాయం వాళ్ల మనసుల్లో ఆరని సెగలు రగిలిస్తూనే వుంది.

"మల్లికి ఇంతమంది వుండి కూడా ఏ ఒక్కరూ ఎదురాడలేకపోయాం" అంటూ వుంటాడు సూరన్న గుర్తొచ్చినప్పుడల్లా.

"నిజమేరా! అల్లు పెద్దోళ్లు. ఆల్లతో కలబడి గెలవలేం. కొండతో గొర్రె పోట్లాడితే ఏటౌతారా! కొండనుంచి ఒక పెల్ల రాలిపడినా ! గొర్రెపానాలే పోగొట్టుకుంటాది" అంటూ కొడుకు మనసును సమాధానపరిచాడు సుబ్బన్న.

ఆ ముసలి గుండె అట్టడుగు పొరల్లో ఏనాటికైనా మాధవ్ మల్లిని పెళ్లి చేసుకొని తీరతాడని నమ్మకం. ఎందుకో తెలిసీతెలియని వయసులో చేసే వాగ్దానాలు, తొలి ప్రేమగాఢత మనిషన్న వాడు మర్చిపోలేడన్న నమ్మకం అది !

* * *

తనలో చెలరేగుతున్న బాధనంతా విద్యుల్లతతో పంచుకున్నాడు మాధవ్.

"సారీ మాధవ్! నిన్ను ఏమో అనుకొని మేమంతా ఆట పట్టించాం. నీలో ఇంత తీవ్రమైన అలజడి వుందని తెలియదుకదా! యు ఆర్ ఎ గ్రేట్ పర్సన్ మాధవ్. కావాలనే చాటుమాటు వ్యవహారాలు సాగించి తప్పుకు తిరిగే మనుష్యులున్న ఈ సమాజంలో నువ్వు నిజంగా పసితనంలో చేసిన ఒక్క పొరపాటుకి, ఉరకలు వేసే వయసును, ఉప్పొంగే మనసును అదిమిపట్టి పశ్చాత్తాపంతో కుంగిపోతున్నావంటే నీ స్వచ్ఛతకీ నిజాయితీకి చెయ్యెత్తి నమస్కరించాలనిపిస్తుంది" అంది విద్యుల్లత ఆర్ద్రపూరిత నేత్రాలతో మాధవ్‌ను చూస్తూ.

మాధవ్ తలదించేసుకున్నాడు. "నాలో నిజాయితీ వుందా! నాకు స్వచ్ఛత నాపాదిస్తున్నావా! లేదు విజ్జూ. నేను స్వార్థపరుణ్ణి. మా కుటుంబ గౌరవాన్ని కాపాడాను తప్ప తెగించి ముందడుగు వేయగలిగానా? అమ్మ ఆ వూళ్లో అడుగు పెట్టద్దంటే మావయ్య ఇంటికి కూడా వెళ్లడం మానుకున్నాను. మల్లి ఎక్కడుందో! ఎలావుందో! క్రమేపీ నా తలపులలో నుండి కూడా దూరమైపోతుందేమో. నేను మనసు లేని మరబొమ్మలా మారి, మామయ్య కూతురి మెళ్లో తాళికట్టి, అమ్మకిచ్చిన వాగ్దానం నిలబెట్టుకోవాలి. అమ్మ ఆ రోజే ఒట్టు వేయించేసుకుంది" మాధవ్ కళ్లనుంచి జలజలా కన్నీళ్లు.

"నువ్వు మరీ ఇంత పిరికి వాడివనుకోలేదు".

"నేను పిరికివాణ్ణే కాదు. పిచ్చివాణ్ణే కూడా, ఇక నా జీవితం ఇంతే".

"అలా ఎందుకవ్వాలి. నీ జీవితం ఏ క్షణంలోనైనా ఏ మలుపైనా తిరగచ్చు" అంది విద్యుల్లత.

"ఇక మలుపులు, మార్పులు ఈ బతుకులో ఏముంటాయి. సుదీర్ఘమైన ఈ జీవన గమనం ఇలా సాగిపోవలసిందే" మాధవ్ నిట్టూర్చాడు.

"అదే వద్దంటాను. నువ్వు నాతో మా వూరురా"

"ఎందుకు ? నిస్తేజమైన నా మనసుకి చైతన్యం కల్గించగలనని భ్రమ పడుతున్నావా?

"భ్రమలూ, భ్రాంతులూ మాట తర్వాత. ముందు కాస్త ఛేంజ్‌గా వుంటుంది. డాక్టర్లు కూడా గాలి మార్పు కావాలంటారుగా!" అంది విద్యుల్లత అనునయంగా.

"సరేకానీ నీ మనసెందుకు నొప్పించాలి" అంటూ లేచాడు మాధవ్.

*   *   *

విద్యుల్లత ఇంట్లో అడుగుపెట్టేసరికి ఆమెను వాటేసుకొని "ఇన్నాళ్లు నిన్ను చూడకపోతే నాకెలానో వుంది ఏ పని మీదకీ బుద్ధిపోవడంలేదు. అమ్మ నొప్పించి నీ దగ్గరకొచ్చేద్దాం అనుకుంటున్నాను" అంది మల్లి.

"నాకు మాత్రం నిన్ను తలవని రోజుందిటే!" అంటూ తనూ మల్లిని పెనవేసుకుపోయింది విద్యుల్లత.

"ఏంటిది మల్లమ్మా! నేను చెప్పిన మాటలన్నీ గాలిలో కలిపేసినావా?" తల్లి మాట విని చటుక్కున దూరంగా జరిగింది మల్లి.

ఆశ్చర్యంగా చుక్కమ్మమైపు చూసింది విద్యుల్లత.

"అవును తల్లీ నువ్వు ముందు ఇంటికెల్లిపో. ఈ పనికిమాలిన పిల్లతో సావాసం సేత్తున్నావని ఇప్పటికే మీ వాల్లు తిట్టిపోత్తన్నారు. పెద్దోల్ల కోపం అగ్గిలాటిదమ్మా. మాలాటోల్లని బుగ్గి సేసీగలదు. నువ్ గొప్పింటి బిడ్డవిగందా! నీతో దీనికి నేత్తమా"

"నువ్వూరుకో చుక్కమ్మా! ఇది మా వాళ్లకు కొత్తేం కాదుగా! నేనవేం పట్టించుకోను"

"అదే నేనంటున్నాను విద్యూ నిన్ను మర్చిపోవటం గనుక జరిగితే నేనంటూ మిగలను. పోనీ నువ్వే చెప్పు నీ అయోమయపు బతుకుని సరిదిద్దావ్. నీ స్నేహంతో సన్మార్గం చూపించావ్. నా మనసుకి విద్యాగంధం పూసి నీ చెలిమితో ఒక్కోమెట్టూ పైకి తీసికెళ్లి ఇంతదాన్ని చేశావ్. పసిపిల్లలకి పంతులమ్మనై, నీ జీవితం సార్థకం చేసుకుంటున్నావు. అదంతా నీ స్నేహం వల్లనే. కానీ నా వల్ల నీకు మాట వస్తుంటే నేనెలా సహించగల...."

"సరే కానీ అటు చూడు. నీకోసం ఎవరిని తీసుకొచ్చానో? అంది విద్యుల్లత మల్లి మాటలకు అడ్డొస్తూ.

ఆ క్షణం వరకూ వాళ్ల మాటలు వింటూ గుమ్మంలోనే నిలబడ్డ మాధవ్ అప్రయత్నంగానే ఇంట్లోకి అడుగేశాడు. అతనికంతా విచిత్రంగా అనిపిస్తోంది. విద్యుల్లత, మల్లి! అయితే

విద్యుల్లతకి ముందే ఇదంతా తెలుసా ?

"అలా విస్తుబోయి చూస్తావేం? ఇంత కాలం నువ్వు ఏ పసిడి మొగ్గకోసం కలవరపడ్డావో ! ఏ బేలకి నీవల్ల అన్యాయం జరిగిందని తపన పడుతున్నావో ! ఆ నీ మల్లి దగ్గరకే వచ్చాం. ఇంక నీ మనస్సును చంపుకోవద్దు మాధవ్. ఆత్మవంచనతో బతకటం నరకప్రాయం. ఒట్టు తీసి గట్టున పడేయ్" మిత్రురాలు వెన్ను తట్టేసరికి మాధవ్‌కి ఎక్కడ లేని శక్తీ వచ్చేసినట్లనిపించింది.

సుబ్బన్నను కలిసి తన మనసులోని మాట చెప్పాడు. ఇక వెను దిరిగి చూసేది లేదన్నాడు.

"నాకు తెలుసు బాబూ, నువ్వు ఎప్పటికైనా వచ్చి మా తల్లిని మనువాడతావని. ఈ రోజు కోసమే ఈ బొందిలో పానాలు నిలుచున్నాయ్. మాధవ్‌బాబు, నీది బంగారు మనసు" ఆనందంతో తబ్బిబ్బై పోయాడు సుబ్బన్న.

ఆ బంగారాన్ని సమ్మెటతో కొట్టి వన్నెలు తెచ్చింది విద్యుల్లత. తనలోవున్న మంచి తనం, మమత మసిబారిపోతున్న సమయంలో విద్యుల్లత తనకి మహోపకారం చేసింది. తను మల్లిని చేపట్టి వీళ్లందరిలో ఎంత సంతోషాన్ని చూడగలుగుతున్నాడు. విద్యుల్లత స్నేహాన్ని, మల్లి అనురాగాన్నీ పొందగలిగాడు. ఈ తృప్తి చాలు తనకి అనుకున్నాడు మాధవ్.

కలో, నిజమో తెలీని స్థితిలో "కలకాదు, నిజమే" అంటున్న మాధవ్ చేతి వేళ్లను మరింత నొక్కిపట్టి మెత్తగా నవ్వింది మల్లి.

*ఫిబ్రవరి 2002, విపుల* ❑